సాక్షి
ప్రకాశం
శుక్రవారం | 26 | మే | 2023



కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

విధి నిర్వహణలో పాముకాటుకు గురై మృతి చెందిన కానిస్టేబుల్ ఇరిగినబోయిన పవన్ కుమార్‌కు గురువారం చీమకుర్తిలో అధికార లాంఛనాలతో వీడ్కోలు పలికారు. - 8లో..



విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
41/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోస్టుల భర్తీకి 31లోగా దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వివిధ రకాల సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు. www.rimsongole. org, http://prakasam.ap.gov.in/notice category/ recruitment వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతపరిచి rimsongole@yahoo.com కు ఈ మెయిల్ పంపించాలని చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సమయంలో ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తును అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని తెలిపారు.

హజ్ యాత్రికులకు 29న శిక్షణ కార్యక్రమం

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి జిల్లా హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమానికి 2023వ సంవత్సరంలో హజ్ యాత్రకు బయలుదేరుతున్న వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ సలహాదారుడు జియావుద్దీన్, జిల్లా హజ్ కమిటీ సభ్యులు, మౌలానాలు పాల్గొంటారని తెలిపారు. శిక్షణ శిబిరంలోనే హజ్ యాత్రికులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 92464 82333, 94402 52387, 85558 08533 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా యనమల వెంకటేశ్వర్లు



ఒంగోలు: పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా యనమల వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు ఆయన కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని బాధిత బాలికలకు ఎలాంటి అన్యాయం జరగకుండా న్యాయస్థానం తరఫున పోరాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనను స్పెషల్ పీపీగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జూన్ 2న గుండు ఎత్తే పోటీలు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట గ్రామంలో హజరత్ మౌలాలి స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి గుండు ఎత్తే పోటీలు నిర్వహించనున్నట్లు దర్గా ధర్మకర్త మధిరె వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అదే రోజు రూ.100 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.2 వేలు, రెండో బహుమతిగా రూ.వెయ్యి, మూడో బహుమతిగా రూ.500 అందజేయనున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు...

హజరత్ మౌలాలీస్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి రాచర్ల మండలంలోని గుడిమెట్ట గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు హజరత్ మౌలాలీస్వామి దర్గా ధర్మకర్త మధిరె వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల ఎడ్ల యజమానులు అదేరోజు ఉదయం 10 గంటల్లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.40 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 96406 54936 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో రేపు సమీక్ష

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాలలో భాగమైన జగనన్న విద్యాదీవెన పథకంపై ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు/కరస్పాండెంట్లతో ఈ నెల 27వ తేదీ సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమం, సాధికారత అధికారి ఎస్.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష ప్రారంభమవుతుందన్నారు. సమీక్ష సమావేశానికి అందరూ హాజరు కావాలని ఆదేశించారు.

పవర్‌ఫుల్‌గా..

ఒకవైపు మండుతున్న ఎండలు.. పెరుగుతున్న విద్యుత్ వినియోగం.. మరోవైపు అకాల వర్షం.. ఉరుములు.. పిడుగులు.. నేలకొరుగుతున్న వృక్షాలు, విద్యుత్ స్తంభాలు... ఇలా ఎంత ఒత్తిడి ఉన్నా మెరుగైన సేవలు అందించేలా ఆ శాఖ ఉన్నతాధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతరాయాలు లేకుండా కరెంటు సరఫరా చేస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకూ ప్రతిరోజూ జిల్లాకు 8.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, ప్రస్తుతం 10 నుంచి 11 మిలియన్ యూనిట్ల వరకూ వినియోగం పెరిగింది. అధికారులు ముందస్తు ప్రణాళికలతో ఎలాంటి విపత్తులు వచ్చినా తక్షణం స్పందించి సమస్యను పరిష్కరిస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.



మార్కాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఇలా...	గృహ కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు	పరిశ్రమల కనెక్షన్లు
	5,97,469	1,59,083	12,222

- మెరుగైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
- కోతలు లేకుండా చర్యలు
- వేసవి సెగలతో పెరిగిన వినియోగం
- అదనంగా రోజుకు 3 మిలియన్ యూనిట్ల డిమాండ్
- అకాల వర్షాల్లోనూ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ముందస్తు ప్రణాళికతో తప్పిన ఇక్కట్లు

మార్కాపురం: వేసవికాలం వచ్చిందంటే గతంలో విద్యుత్ కోతలు తప్పేవి కావు. ఏదైనా విపత్తు వచ్చినా గంటల తరబడి కరెంటు సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వేసవిలో సైతం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఎండలు మండిపోతూ అమాంతం విద్యుత్ వినియోగం పెరిగినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా గృహాలకు, వ్యవసాయానికి, పరిశ్రమలకు కరెంటు అందిస్తున్నారు. జిల్లాలో డిమాండ్‌కు తగినట్లుగా విజయవాడలోని గ్రిడ్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. ఏప్రిల్‌లో వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కొంచెం ఎక్కువగా ఉన్నాయి. అయినా విద్యుత్ వినియోగం పెద్దగా పెరగలేదు. ఎప్పటిలాగే రోజూ 8 నుంచి 8.5 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండేది. ఏప్రిల్ నెలాఖరు నుంచి మే రెండో వారం వరకూ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్ల వినియోగం ఎక్కువైంది. ఒక్కసారిగా రోజుకు రెండు నుంచి మూడు మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం పెరిగింది. అలాంటి సందర్భాల్లో సైతం కోతల్లేకుండా కరెంటు సరఫరా చేశారు. సమస్య తలెత్తిన సందర్భాలు అతి తక్కువనే చెప్పాలి.

ముందస్తు జాగ్రత్తలు...

సచివాలయాల పరిధిలో ఉండే లైన్‌మన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు గృహ విద్యుత్‌కు సంబంధించి నివాస ప్రాంతాలపై సర్వే చేశారు. గాలి వీస్తే విద్యుత్ తీగలకు అడ్డుపడే చెట్లకొమ్మలను గుర్తించి ముందుగానే కొట్టించారు. లూజ్ కనెక్షన్లను ఎప్పటికప్పుడు సరిచేశారు. తరచూ మరమ్మతులకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి అమర్చారు, అవసరమైన స్పేర్ పార్ట్స్ బిగించి లోపాలను సరిదిద్దారు.

పశ్చిమ ప్రకాశంపై ప్రత్యేక దృష్టి...

వెనుకబడిన పశ్చిమ ప్రకాశంపై విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వేసవి తీవ్రత దృష్ట్యా మార్చి నుంచి జూన్ వరకు ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకం ఎక్కువ కావడంతో ప్రతిరోజూ 175 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతోంది. సాధారణ రోజుల్లో 120 నుంచి 130 మెగావాట్ల విద్యుత్ సరిపోతుంది. మార్కాపురం డివిజన్‌లో మొత్తం 93 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటిలో మార్కాపురంలో 27, వై.పాలెంలో 26, కంభంలో 18, గిద్దలూరులో 22 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మార్కాపురం, గిద్దలూరు, కంభం, దోర్నాల, కేసినేనిపల్లి, యర్రగొండపాలెం, రాచర్లలో ఎక్స్‌ట్రా హై ఓల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల (ఈహెచ్‌టీ) సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు మార్కాపురం మండలం దరిమడుగు వద్ద 220/30 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఇక్కడి నుంచి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ సబ్‌స్టేషన్‌ను విజయవాడలోని పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్ 1.5 మెగా వాట్ల నుంచి 3 మెగా వాట్ల వరకు విద్యుత్ సరఫరా చేస్తోంది. ఇటీవల విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడంతో దాదాపు మూడు నుంచి నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అది మినహా ఈ వేసవిలో విద్యుత్ కోతలు లేవనే చెప్పాలి.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఇలా...

జిల్లాలో దర్శి, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఎల్‌టీ–1 కేటగిరిలో ఇంటి కనెక్షన్లు, ఎల్‌టీ–2లో కమర్షియల్ కనెక్షన్లు, ఎల్‌టీ–3లో పరిశ్రమలు, ఎల్‌టీ–4లో ప్రభుత్వ కార్యాలయాలు, నీటి పథకాలు, ఎల్‌టీ–5లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

సబ్ డివిజన్ల వారీగా విద్యుత్ కనెక్షన్ల వివరాలు...

డివిజన్	ఎల్‌టీ–1	ఎల్‌టీ–2	ఎల్‌టీ–3	ఎల్‌టీ–4	ఎల్‌టీ–5
దర్శి	1,33,109	13,016	1,446	2,476	54,599
కనిగిరి	72,912	7,182	231	1,774	24,184
మార్కాపురం	1,88,906	18,836	798	5,128	69,903
ఒంగోలు	2,02,542	24,521	1,297	2,844	10,397

విద్యుత్‌ను ఆదా చేయండి



ప్రజలు విద్యుత్‌ను ఆదా చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఇంటికి వెళ్లేటప్పుడు ఏసీలు, కూలర్లు, లైట్లు, ఫ్యాన్లు ఆపివేయాలి. ఇళ్లలో కూడా డబుల్ ఏసీ ఉన్నవాళ్లు సింగిల్ ఏసీ వాడుతూ విద్యుత్‌ను పొదుపు చేయాలి. ఫ్యాన్లు వేసి బయటకు రావద్దు. పరిశ్రమల నిర్వాహకులు విద్యుత్ ఆదాపై దృష్టి పెట్టాలి. బిల్లులు కూడా సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలి.

– శియానాయక్, డీఈ, మార్కాపురం

నారాయణ స్కూల్‌కు తాళం

- కనిగిరిలో అనుమతి లేకపోవడంతో సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు
- తొలుత అధికారులను అడ్డుకున్న స్కూల్ సిబ్బంది
- పోలీసుల సహాయంతో వెళ్లి తాళం వేసిన అధికారులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



పోలీసుల సమక్షంలో నారాయణ స్కూల్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు



సీజ్ చేసిన నారాయణ స్కూల్

కనిగిరి రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఎదురుగా ప్రభుత్వ అనుమతి, గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌ను గురువారం విద్యాశాఖ అధికారులు సీజ్ చేసి తాళం వేశారు. ఆర్జేడీ, డీఈవోల ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు వెళ్లి స్కూల్‌ను మూసివేశారు. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఫీజులు చెల్లించామంటూ వారంతా బోరుమంటున్నారు.

అడ్డుకున్న నారాయణ సిబ్బంది.. ఇప్పటికే అనేకసార్లు చెప్పామన్న డిప్యూటీ డీఈవో...

స్కూల్‌ను సీజ్ చేసేందుకు వెళ్లిన విద్యాశాఖ అధికారులను తొలుత నారాయణ స్కూల్ సిబ్బంది అడ్డుకుని ఎదురు దాడికి దిగారు. స్కూల్ వద్దకు వెళ్లిన డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, ఎంఈవో జే ప్రసాద్‌రావును అడ్డుకోవడంతో వారు స్కూల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక సార్లు చెప్పామని, నోటీసులు కూడా ఇచ్చామని తెలిపారు. బుధవారం కూడా ఎంఈవో వచ్చి చెప్పినా లెక్క చేయలేదని మండిపడ్డారు. స్కూల్‌ను ఖాళీ చేస్తారా లేక మమ్మల్ని తాళం వేయమంటారా అని డిప్యూటీ డీఈవో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మూడు రోజులు సమయం ఇవ్వాలని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అడిగారు. నోటీసులతో పాటు కావాల్సినంత సమయమిచ్చామని, మళ్లీ సమయం అడిగితే ఎలాగని ప్రశ్నించారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని, అందరూ బయటకు వెళ్లాలని చెప్పారు. పాఠశాలకు తాళం వేసేందుకు ప్రయత్నం చేయగా, నారాయణ సిబ్బంది సహకరించకుండా అడ్డుకోవడంతో పాటు పట్టణంలో ఇలా చాలా పాఠశాలలు ఉన్నాయని, తాము తాళం వేయనీయమని అన్నారు. వేరే పాఠశాల అనుమతితో నారాయణ బోర్డు పెట్టి పాఠశాల నడుపుతున్నారని, పత్రికల్లో కూడా వార్తలు వచ్చాయని, అనేక మంది ఫిర్యాదు చేశారని, ఆర్జేడీ ఆదేశాల మేరకే తాము వచ్చామని అధికారులు చెప్పినా వినిపించుకోలేదు. విధులను అడ్డుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పి అధికారులు బయటకు వచ్చారు.

ప్రశ్నల దాడి చేసిన అనుకూల మీడియా...

నారాయణ స్కూల్ మూసివేతకు వచ్చిన విద్యాశాఖ అధికారులపై ఆ స్కూల్ అనుకూల ఎల్లో మీడియా ప్రశ్నల దాడి చేసింది. పట్టణంలో అనేక పాఠశాలలు అనుమతి లేకుండా నడుస్తున్నాయని, వాటిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నారాయణ స్కూల్‌పై మాత్రమే ఎందుకు చర్యలు తీసుకుంటున్నారని అడిగారు. నారాయణ స్కూల్‌ను ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా పెట్టి మరీ వేరే పాఠశాల అనుమతులతో నారాయణ స్కూల్ బోర్డు పెట్టి నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని డిప్యూటీ డీఈవో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల అనుమతుల వివరాలను ఎంఈవో ద్వారా తెప్పించుకుని అవకతవకలు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పోలీసుల సహాయంతో స్కూల్‌కు తాళం...

విద్యాశాఖ అధికారులు తొలుత పోలీస్ ప్రొటెక్షన్ లేకుండా నారాయణ పాఠశాల మూసివేతకు వెళ్లారు. అక్కడి సిబ్బంది అడ్డుకోవడంతో మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోలీసుల సహకారంతో వెళ్లి స్కూల్ ప్రధాన గేట్లకు తాళాలు వేశారు. పామూరు సీఐ శ్రీనివాసరావు, కనిగిరి ఎస్సై దాసరి ప్రసాద్, పోలీస్ సిబ్బంది సహాయంతో స్కూల్‌ను సీజ్ చేశారు. ఎంఈవోలు జే ప్రసాద్, దాసు ప్రసాద్, హెచ్‌ఎంల సంఘ అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి తదితరులు ఉన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

త్వరలో ఇంటి స్థల పట్టాలు

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు: నగరంలో అర్హులైన ప్రతిఒక్కరికీ త్వరలో ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని 5వ డివిజన్‌లో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గోపాలనగరం రెండో లైను ఎక్స్‌టెన్షన్‌లో ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా..? అని ఆరా తీశారు. ఇతర సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్లను సైతం ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారంటూ పలువురు వృద్ధులు సంతోషంగా చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరకాలం సీఎంగా ఉండాలంటూ ఆశీర్వదించారు. బాలినేని మాట్లాడుతూ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐదో డివిజన్ కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సత్యన్నారాయణరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, బొమ్మినేని మురళి, తాళ్లపాలెం శ్రీనివాసరావు, జమ్ము శ్రీకాంత్, మిరియం వెంకటేశ్వర్లు, టి.మోహన్‌రావు, ఆసోది విజయలక్ష్మి, వాకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- ఎండల నుంచి కాస్త ఉపశమనం
- కొన్నిచోట్ల బలమైన గాలులకు విరిగిపడిన చెట్లు
- దెబ్బతిన్న విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు



ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం



టంగుటూరు మండలం జమ్ములపాలెం వద్ద చెట్లు విరిగి రోడ్డుకి అడ్డంగా పడటంతో నిలిచిన వాహనాలు

ఒంగోలు అర్బన్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే రోహిణీకార్తె ప్రారంభం రోజే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గురువారం మధ్యాహ్నం వరకూ ఎండ దంచికొట్టింది. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల రెండో వారంలోనూ ఐదారు రోజుల పాటు 45 డిగ్రీలకుపైగా తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు తట్టుకోలేకపోయారు. గతవారంలో ఉష్ణోగ్రతలు కాస్త దిగిరాగా, గురువారం నుంచి రోహిణీకార్తె ప్రారంభం కావడంతో మళ్లీ 40 డిగ్రీలపైకి చేరాయి. మండుటెండతో ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత ఊరట చెందారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో కూడా బలమైన గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. అయితే, కొన్నిచోట్ల చెట్లు విరిగి రోడ్లపై, విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తమై వెంటనే మరమ్మతులు చేపట్టారు. టంగుటూరు మండలంలో భారీగా ఈదురు గాలులతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చెట్లు రోడ్లపై విరిగి పడి కొంతసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నాగులుప్పలపాడు, దర్శి, కురిచేడు, తాళ్లూరు మండలాల్లోనూ అదే పరిస్థితి. పొదిలి మండలం జువ్వలేరులో విద్యుత్ తీగలు తెగిపడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొత్తపట్నం మండలంలోని 15 పంచాయతీల్లోనూ ఈదురుగాలులతో కూడిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేశారు. ఇతర మండలాల్లో వర్షాలు లేకపోయినా మబ్బులు పట్టి వాతావరణం చల్లగా మారింది. మొత్తంమీద మండు వేసవిలోనూ వాతావరణం అకస్మాత్తుగా చల్లబడటంతో ప్రజలు ఆహ్లాదంగా గడిపారు.

కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో పవన్‌కుమార్ అంత్యక్రియలు
- నివాళులర్పించిన ఎస్పీ, ట్రైనీ ఎస్పీ, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే
- కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పోలీస్ శాఖ భరోసా



పవన్‌కుమార్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఎస్పీ మలికాగర్గ్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ట్రైనీ ఎస్పీ అంకిత సురానా, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎస్పీ, ట్రైనీ ఎస్పీ, ఎమ్మెల్యే, డీఎస్పీ తదితరులు

చీమకుర్తి: విధి నిర్వహణలో పాముకాటుకు గురై మృతి చెందిన కానిస్టేబుల్ ఇరిగినబోయిన పవన్‌కుమార్‌కు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీస్ అధికారులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఎస్పీ మలికాగర్గ్ ఆధ్వర్యంలో గురువారం చీమకుర్తిలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పవన్‌కుమార్ భౌతికకాయానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ట్రైనీ ఎస్పీ అంకిత సురానా, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. ఆధైర్యపడవద్దని, అండగా ఉంటామని కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్ ఆమ్రావతి సమీపంలోని తుళ్లూరులో విధులు నిర్వహిస్తూ ఈ నెల 23వ తేదీ రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురై చికిత్స పొందుతూ 24వ తేదీ రాత్రి మృతి చెందిన సంగతి తెలిసిందే. భౌతికకాయాన్ని గురువారం పవన్‌కుమార్ స్వగ్రామమైన చీమకుర్తి పట్టణంలోని దిన్నేపూలనికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. చీమకుర్తికి చెందిన ఇరిగినబోయిన రామకృష్ణ, పద్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె కాగా, వారిలో రెండో కుమారుడు పవన్‌కుమార్ 2012 బ్యాచ్‌లో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పవన్ కుమార్ భౌతికకాయాన్ని చూడగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భావోద్వేగానికి గురై రోదించారు. వారిని ఎస్పీ మలికాగర్గ్, ప్రజాప్రతినిధులు ఓదార్చారు. పోలీసు శాఖ తరఫున రావాలసిన పరిహారం, ఇతర ప్రయోజనాలను వీలైనంత త్వరగా అందిస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని పవన్ కుటుంబ సభ్యులకు ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం పోలీసులు గన్‌సెల్యూట్ చేసి మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి దహన సంస్కారాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ మరియదాసు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, చీమకుర్తి ఎస్సై జి.రమేష్‌రెడ్డి, స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొగాకు ధర కేజీ @ రూ.202

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం గరిష్ఠ ధర కేజీ రూ.202 పలికింది. ఈ సీజన్‌లో ఒంగోలు రీజియన్ పరిధిలో నమోదైన ధరలతో పోలిస్తే ఇదే అత్యధికం. కేజీ రూ.202 చొప్పున పొగాకు కొనేందుకు వ్యాపారులు పోటీపడటం గమనార్హం. టంగుటూరు, జరుగుమల్లి, సారువారిపాలెం గ్రామాల రైతులు 508 బేళ్లను వేలానికి ఉంచగా 504 కొనుగోలయ్యాయి. 4 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.172, సరాసరి ధర రూ.199.92 పలికింది. వేలంలో మొత్తం 27 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన పోటీల్లో మైనంపాడుకు చెందిన పూజిత, కమ్రున్, అంజనాదేవి, వైష్ణవి, సుశ్మిత, నాగవేణి, బాలాజీ ఎంపికయ్యారని హెచ్‌ఎం మాబు సుభాని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వరకు అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పీడీ, పీఈటీ, స్కూలు కమిటీ సభ్యులు అభినందించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కరవేదు: జిల్లా సరిహద్దుకు కూతవేటు దూరంలో పల్నాడు జిల్లా చింతలచెరువు వద్ద గుంటూరు–నంద్యాల రైల్వేలైను 107వ మైలు వద్ద రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దొనకొండ జీఆర్పీ ఇన్‌చార్జి పూర్ణమహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..పల్నాడు జిల్లా నూజెండ్ల మండల పాతనాగిరెడ్డి పల్లికి చెందిన చింతలచెరువు మీరావలి (25) గుంటూరు వైపు ఉదయం హుబ్లీ నుంచి విజయవాడ వెళ్లే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29న ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని అయ్యలూరివారిపల్లిలో పోలేరమ్మ తల్లి వార్షిక మేడ కల్లో భాగంగా ఈ నెల 29 నుంచి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల బహుమతులుగా రూ.70,116, రూ.50,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116, రూ.5,116 అందజేస్తామన్నారు. వివరాలకు 9901769999, 9886399938 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మాధవరావు

బేస్తవారిపేట: మండలంలోని పికివా యగ్గు సమీపంలోని కొండలో 40 నుంచి 50 ఏళ్ల వ్యక్తి ఎముకలతో కూడిన అస్థిపంజరం ఉండటాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. మృతదేహం పక్కన ఎరుపు–నలుపు రంగుల టవల్, ఆకుపచ్చ రంగు డిజైన్ లుంగీ, తెలుపు రంగు నిండు చేతుల చొక్కా ఉన్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. పై ఆనవాళ్లు కలిగిన వ్యక్తి ఏ గ్రామంలోనైనా తప్పిపోయి ఉంటే సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

టీఎంసెట్ ఫలితాల్లో మెరిసిన గిద్దలూరు విద్యార్థులు



షానవాజ్ ఆకాష్ సాయిప్రణీత్

గిద్దలూరు రూరల్: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో గిద్దలూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు షేక్ రఫీ కుమారుడు షానవాజ్ 157వ ర్యాంక్, ఓ ప్రకటలో విలేకరిగా పనిచేస్తున్న శ్రీనివాసులు కుమారుడు కిరుషపల్లె ఆకాష్ 475వ ర్యాంక్, వ్యాపారి గర్రె శివ కుమారుడు సాయిప్రణీతు 516వ ర్యాంక్ సాధించారు. వీరు మున్సుగురు విజయవాడలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ర్యాంకులు సాధించిన సందర్భంగా స్నేహితులు, బంధువులు ప్రశంసించారు.

వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

- రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



మాట్లాడుతున్న రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఒంగోలు: వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. జిల్లాలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ట్రాన్స్‌కో, డిస్కంల సమన్వయం వంటి అంశాలపై స్థానిక రాంనగర్‌లోని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో గురువారం ఆయన ఎస్‌ఈలు, ఈఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. వేసవిలో అత్యధికంగా 251 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. వేసవిలో ఏదైనా అంతరాయం కలిగితే తక్షణమే స్పందించేందుకు 24 గంటల పాటు విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నారన్నారు. వేసవిలో విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందని, పీక్ టైమ్‌లో 12600 మెగావాట్ల విద్యుత్‌ను కూడా అందించగలిగామని తెలిపారు. ఓవర్‌లోడ్ పెరుగుతున్న ప్రజల అవసరాలకు ఏమాత్రం ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌కో, డిస్కంలకు సంబంధించి సమీక్షించడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు వ్యక్తం చేస్తున్న సమస్యలను కూడా వేగవంతంగా పరిష్కరిస్తున్నామన్నారు. రైతులు ఎప్పుడు విద్యుత్ కనెక్షన్ అడిగినా ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తున్నామన్నారు. జగనన్న గృహ కాలనీల్లో విద్యుదీకరణ పనుల గురించి కూడా చర్చించామన్నారు. ఆర్‌బీఎల్ మార్ అండ్ జలవిద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రారంభించామని, దీనివల్ల అతితక్కువ ఖర్చుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలుగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఎండి జె.పద్మ జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైనచూడ నిగనిగనుండు కోసిచూడ పురుగులుండు

- ఉలవపాడు మామిడికి 'మచ్చ'
- విక్రయాలపై రైతుల్లో ఆందోళన



కుళ్లిన మామిడి పండ్లు

ఉలవపాడు: నోరూరించే ఉలవపాడు మామిడి నాణ్యతకు పండు ఈగ దెబ్బకొట్టింది. రెండేళ్లుగా పండు ఈగ దెబ్బకు మామిడి కాయల్లో పురుగులు వస్తున్నాయి. ఈ ఏడాది కూడా పచ్చి కాయలు కోసి పండిస్తున్నంత వరకు కాయల్లో పురుగులు కనిపించలేదు. వారం రోజులుగా వడగాడ్పులకు మామిడికాయలు పండుతున్నాయి. ఈ పండు మామిడికాయల్లో అధిక శాతం కాయల్లో పురుగులు వస్తున్నాయి. ఈ ఏడాది పురుగులు రాకుండా రైతులు పలు నివారణ చర్యలు చేపట్టినా కాయల్లో పురుగులు వచ్చాయి. ప్రస్తుతం ఎగుమతులు జరుగుతుండటంతో పురుగులు లేకుండా కాయలను ఎన్నుకున్న తర్వాత్లో నుంచి మాత్రమే ఎగుమతి చేయడానికి ఇష్టపడుతున్నారు. ప్రధానంగా ఇసుక నేలలో పండించిన కాయలకు ఎక్కువగా పురుగులు వస్తున్నాయి. ఎర్ర నేలలో పండించిన కాయలకు కూడా పురుగులు వస్తున్నప్పటికీ ఇసుక నేల కాయల కన్నా తక్కువగా ఉంటున్నాయి. రెండు రోజుల క్రితం ఉలవపాడుకు సంబంధించిన ఇద్దరు వైద్యశాఖ అధికారులు తమ ఉన్న తాడిపాడులకు మామిడి కాయల బాక్సులు పంపించారు. వీటిని చూస్తే కాయల్లో పురుగులు ఉన్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండేళ్ల నుంచి ఉలవపాడు మామిడి నాణ్యత తగ్గింది.

శభాష్ బేటీ..

- ఏషియా పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో స్వర్ణం సాధించిన బాలికను బాలినేని అభినందన



కల్లు రాజేశ్వరిని అభినందిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: దక్షిణ కొరియాలో ఇటీవల నిర్వహించిన ఏషియా పసిఫిక్ మాస్టర్స్ గేమ్స్‌లో డిస్కస్ త్రో పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్న కల్లు రాజేశ్వరిని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం బాలినేని ఆయన నివాసంలో కల్లు రాజేశ్వరి, ఆమె కుటుంబ సభ్యులు కలిశారు. ర్యాంగింగ్‌లో 5 కిలోమీటర్ల విభాగంలో రజతం లభించిందని రాజేశ్వరి వివరించగా భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని బాలినేని ఆకాంక్షించారు. పాన్ ఇండియా మాస్టర్ గేమ్స్ జిల్లా కార్యదర్శి దాసరి విజయభాస్కర్, బిల్లకొండ నరేష్ తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఒంగోలు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ 7వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి తీర్పునిచ్చారు. కేవలం ఏడాదికాలంలోనే రెండు ఎస్సీ, ఎస్టీ కేసుల్లో శిక్షపడేలా కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు. చీమకుర్తికి చెందిన దేవరకొండ లక్ష్మ(52), అదే గ్రామానికి చెందిన గణ్ణల శ్రీను పాత పరిచయం, ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ చీమకుర్తిలోని నెహ్రూనగర్ 2వ లైనులో ఒక ఇంట్లో సహజీవనం చేస్తుండేవారు. 2022 ఫిబ్రవరి 13న రాత్రి 10 గంటల సమయంలో మద్యం కోసం డబ్బు విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగి ఆటుక రాయితో రత్తమ్మ తలపై బలంగా మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీనిపై పోలీసులు ఎస్సీ,ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు వేశారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి డీఎస్పీ నాగరాజు, సీఐ రాంబాబు, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, చీమకుర్తి కానిస్టేబుల్ హరికృష్ణను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పూరిల్లు అగ్నికి ఆహుతి



మంటల్లో కాలిపోతున్న పూరిల్లు

త్రిపురాంతకం: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైన సంఘటన త్రిపురాంతకం అంబేడ్కర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన ఎం.కోటయ్యకు చెందిన పూరిగుడిసెలో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. మంటలు ఆర్పేందుకు యత్నించేలోపే కార్పెట్టు మొత్తం కాలిపోయింది. ఇంట్లో సామాగ్రి, నిత్యావసరాలు అగ్నికి ఆహుతయ్యాయి. కొత్త ఇల్లు నిర్మించుకునేందుకు దాచి ఉంచిన లక్ష రూపాయల నగదు సైతం కాలి బూడిదైనట్లు కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. యర్రగొండపాలెం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినా ఈ లోపే నష్టం జరిగిపోయింది. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, వీఆర్‌ఓ శివలింగయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి పరామర్శించారు.

ప్రయాణికులపైకి దూసుకెళ్లిన ఆటో

- ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో..



క్షతగాత్రురాలికి చికిత్స చేస్తున్న వైద్యులు

యర్రగొండపాలెం: స్థానిక మార్కాపురం రోడ్డులోని టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉన్న ప్రయాణికులపైకి ఆటో దూసుకువెళ్లడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..పల్నాడు జిల్లా గురజాల మండలం గొట్టిముక్కల పంచాయతీలోని సమాధానంపేట తండాకు చెందిన వారు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలోని సంజీవనగర్ తండాలో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ టోల్‌ప్లాజా వద్ద లారీని నిలిపి టీ సేద తీరుతున్నారు. ఈ సమయంలో అత్మకూరు నుంచి మార్కాపురం వెళ్తున్న ఆటో వారిపైకి దూసుకొని వెళ్లి లారీని ఢీకొంది. ప్రమాదంలో సమాధానంపేట తండాకు చెందిన అరుణాబాయి, శ్రావణిబాయి, బుజ్జిబాయి, కొండనాయక్, బాలమ్మలకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. అరుణాబాయి, శ్రావణిబాయి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఈ కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

- పోలీసుల రాకతో నిందితుడు పరార్
- రెండు కార్లు, మూడు ద్విచక్రవాహనాలు సీజ్

టంగుటూరు: ఓ ఇంట్లో నిల్వ ఉంచి గుట్టుగా విక్రయిస్తున్న మద్యాన్ని ఎస్‌ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. జమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పుల్లా ప్రేమ్‌కుమార్‌బాబు కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మద్యం తీసుకొచ్చి ఇంట్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. దీనిపై పూర్తి సమాచారం సేకరించిన ఎస్‌ఈబీ టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అతని ఇంటిని, చుట్టు పక్కల నివాసాలను జల్లెడ పట్టారు. నిందితుడి ఇంటి పరిసరాల్లో ఓ పాడుబడిన గదిలో దాచి ఉంచిన ఆరు మద్యం కేసులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకతో నిందితుడు పరారుకావడంతో, అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులను సుమారు 3 గంటలపాటు విచారించారు. కాగా నిందితుడికి చెందిన రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సమాచారం. నిందితుడిపై గతంలో పలు కేసులు, రౌడీషీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ డీఎస్పీ సుదర్శన్‌బాబు, ఒంగోలు ఎస్‌ఈబీ సీఐ లత, టీటీఎఫ్ ఎస్సై శ్రీనివాసులు, సింగరాయకొండ ఎస్‌ఈబీ ఎస్సై దయాకర్, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.